ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G), రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

WWW.GAYATHRINEWS.COM


# గాయత్రి న్యూస్

APTEL/26/A3646

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ మంగళవారం 26-05-2026 సంపుటి : 1 సంచిక :02 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-

## భారత్‌తో ఘర్షణపడే ఉద్దేశం లేదు

### భారత్‌తో బంధాన్ని పణంగా పెట్టబోం



వాణిజ్యంపై భారత్‌తో ఘర్షణకు దిగే ఉద్దేశం అమెరికాకు ఎంతమాత్రం లేదని ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో స్పష్టంచేశారు. అధ్యక్షుడు ట్రంప్ పాటిస్తున్న విధానం.. ప్రపంచంతో అమెరికా చేస్తున్న వాణిజ్యాన్ని సరి చేయడానికే తప్ప నిర్దిష్టంగా ఏ దేశానికీ వ్యతిరేకం కాదని తెలిపారు. వాణిజ్యంలో అసమతౌల్యాన్ని సరిచేసి, వ్యవస్థ ముందుకు వెళ్లేలా చూడాలనేదే ఆయన ఉద్దేశమని వివరించారు.

## నీట్ పేపర్ లీక్.. ఎన్‌టీఏ పాఠాలు నేర్చుకోలేదు: సుప్రీం అసహనం



### ప్రధాని మోదీతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు భేటీ



ప్రధాని నరేంద్రమోదీతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు భేటీ అయ్యారు. ఢిల్లీలోని సేవా తీర్థ్‌లో ఆయనతో సమావేశమయ్యారు.

## ఏపీలో కోటి ఎంఎస్ఎంఈలు ప్రారంభం కావాలి సీఎం

దేశ ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) వెన్నెముక అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ రంగం యువత కలలకు వేదికని చెప్పారు. విజయవాడలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్‌లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు.

"మహిళా ఉత్పత్తులను ప్రపంచానికి పరిచయం చేసేది ఎంఎస్ఎంఈలే.

స్టాళ్లను సందర్శించి, స్టార్టప్ సంస్థలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం 38 పారిశ్రామిక పార్కులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం తర్వాత ఎక్కువమందికి ఉపాధి కల్పిస్తున్న రంగం ఎంఎస్ఎంఈ అని అన్నారు. ఇవి సరికొత్త ఆలోచనలకు వేదిక కావాలి. ఈ వేదిక ద్వారా అనేక ఒప్పందాలకు శ్రీకారం చుట్టాం. రాష్ట్రంలో కోటి ఎంఎస్ఎంఈలు ప్రారంభం కావాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రత్యేక రాయితీలు ఇస్తున్నాం. 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలో 550 ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కులు వస్తున్నాయి.



### మనకు జీవితాన్నిచ్చే నదులను చంపవద్దు: పవన్ కల్యాణ్



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారులతో జరిగిన సమీక్షలో కీలక వ్యాఖ్యలు చేశారు. మనకు జీవితాన్ని ఇచ్చే నదులను చంపవద్దని అన్నారు. గోదావరి, కృష్ణ నదులను రక్షించుకోవాలని తెలిపారు. వచ్చే 6 నెలల్లో నదుల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని ఆదేశించారు.

### ప్రజల సేవింగ్స్ తగలబెట్టడానికి పెట్రోల్ చల్లుతున్నారు: కేంద్రంపై ఖర్గే



### లిక్కర్ స్కామ్‌లో నా భార్యకు నోటీసులు అవాస్తవం: కేశినేని శివనాథ్



### ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయకపోతే.. కలెక్టరేట్ ముట్టడిస్తాం



రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయకపోతే.. వేలాది మంది రైతులతో సిద్దిపేట కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. వడ్ల కొనుగోలు విషయంలో ప్రభుత్వానిది మిషన్ మోడ్ కాదని, కమిషన్ మోడ్ అని విమర్శించారు. ఎన్సాన్‌పల్లి వద్ద కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ ట్రిప్పులు ఆపి.. కొనుగోలు కేంద్రాలకు లారీల ట్రిప్పులు పెంచాలని అన్నారు.క్వింటాల్ ధాన్యానికి 5 కిలోల తరుగుతో రైతులు నిలువునా మోసపోతున్నా మంత్రులకు, అధికారులకు పట్టింపు లేదని విమర్శించారు.

### జగన్ చెల్లని రూపాయి.. ప్రజలు విశ్వసించరు

"రాష్ట్రానికి జగన్ హానీమూన్ నాయకుడు.



కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓర్వలేక సీఎం చంద్రబాబుపై జగన్ అక్కసు వెళ్లగక్కుతున్నారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విమర్శించారు. జగన్ ఇటీవల ప్రెస్‌మీట్‌లో తాత, తండ్రి, బాబాయ్ మృతి అంశాలను ప్రస్తావించారని.. పాత సారాను కొత్త సీసాలో పోసి మార్కెటింగ్ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు.

## ఆ స్కూల్‌ని ఓసారి సందర్శించండి.. సీపీఎం నేతలతో సీఎం రేవంత్ రెడ్డి



ధాన్యం కొనుగోళ్లపై నిరంతర సమీక్ష

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కారణంగా హమాలీలు వారి స్వస్థలాలకు వెళ్లడంతో ఇక్కడ కొరత ఏర్పడిందన్నారు. మరోవైపు ఎండల తీవ్రత కారణంగా మధ్యాహ్నం సమయంలో పని జరగడం లేదని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి.. మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.

<u>కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు పెంచడమే తప్ప పంటలను కొనుగోలు చేయడం లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. కనీసం 30 శాతం కూడా సేకరించడం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో సీపీఎం, సీపీఐ బృందాలు వేర్వేరుగా సీఎంతో సమావేశమయ్యాయి.</u>

# అమృతలూరులో ఈదురుగాలుల బీభత్సం - చెట్లు పడి విద్యుత్ వైర్లు తెగి మూడు విద్యుత్ స్తంభాలు నేలమట్టం

**- వేమూరు ఎమ్మెల్యే కారుకు తృటిలో తప్పిన ప్రమాదం**
**- 16 గంటలు విద్యుత్ సరఫరాకు అంతరాయం, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ**
**- గ్రామ పార్టీ అధ్యక్షుని కారు పై పడ్డ చెట్టు,కారు పాక్షికంగా ధ్వంసం**

గాయత్రి న్యూస్

బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం మండల కేంద్రం అమృతలూరులో ఆదివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది.దీంతో వేమూరు ఎమ్మెల్యే కారుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఎమ్మెల్యే కారు వెనుక ఉన్న గ్రామ పార్టీ అధ్యక్షుని కారుపై చెట్టు పడి పాక్షికంగా ధ్వంసం అయింది. ఆదివారం 46డీ ఉష్ణోగ్రతతో భానుడి సెగలు ప్రజలను అల్లాడించింది,సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం లో మార్పు రావడం,ఈదురు గాలులతో రాత్రి 7.30 గంటలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి వర్షం ప్రారంభమైంది.అదే సమయంలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మండల కేంద్రం అమృతలూరులో జరిగే ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు.అక్కడ పని ముగించుకుని ఎనిమిది గంటల సమయంలో ఇటీవల అమృతలూరులో పునః ప్రతిష్టించిన కొత్తపల్లి వారి రామ మందిరంలో జరుగు



పూజాది కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఆనంద బాబు పాల్గొన్నారు.అదే సమయంలో కొత్తపల్లి వారి రామ మందిరం ఎదురుగా ఉన్న గ్రామ దేవత పుట్లమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఉన్న వేప చెట్టు ఈదురు గాలులకు వేళ్ళతో సహా విరిగి విద్యుత్ వైర్లపై నుండి ఎమ్మెల్యే కారు వెనుక ఉన్న గ్రామ పార్టీ అధ్యక్షుడు కారుపై పడటంతో ఆకారు పాక్షికంగా దెబ్బతింది,పక్కనే ఉన్న గ్రంథాలయ దుకాణాల సముదాయం రేకుల పంచ పూర్తిగా దెబ్బతిని పడిపోయింది, మూడు విద్యుత్ స్తంభాలు నేలమట్టం వరకు విరిగిపడిపోయాయి,దీంతో తెనాలి - చెరుకుపల్లి ఆర్ అండ్ బి రహదారిపై భారీ స్థాయిలో వాహనాలు నిలిచిపోయి, ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్కో,గ్రామపంచాయతీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పడిపోయిన చెట్టును, విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలను, ప్రోక్లైనర్ సహాయంతో తొలగించి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.ఈ క్రమంలో అమృతలూరు గ్రామంలో 11 కెవి విద్యుత్ వైర్లు తెగి విద్యుత్ స్తంభాలు నేలమట్టం కావడంతో గ్రామంలో విద్యుత్ సరఫరా లేక అంధకారం అలుముకుంది,ఏ.పీ. సి.పి.డి.సి.ఎల్,ఏ.డి.ఈ, రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆయన సూచనలు,సలహాలు మేరకు ఏ.ఈ,ఎల్.నిరంజన్ కుమార్,ఎల్.ఐ,ఎం.రమేష్,లైన్ మాన్,గద్దె విజయ రాజ్ ఆధ్వర్యంలో సిబ్బంది,కాంట్రాక్ట్ సిబ్బంది ఆదివారం రాత్రి రంగ ప్రవేశం చేసి హుటాహుటిన ప్రజా సంక్షేమం కోరి ఆదివారం రాత్రి నుండే యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టి,నూతనంగా మూడు విద్యుత్ స్తంభాలు ఎత్తి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు గ్రామంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఈదురు గాలులకు యలవర్రు రోడ్లో,యర్రగుంట రోడ్లో చెట్లు పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో డిప్యూటీ ఎంపీడీవో,అమృతలూరు గ్రామ ప్రత్యేకాధికారి,జొన్నలగడ్డ వినయ్ బాబు,పంచాయతీ కార్యదర్శి, బోగాది తిరుమలరావు, సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టారు.

# బందనపూడిలో రూ.36 లక్షలతో గ్రామ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి శంకుస్థాపన

**- ప్రజారోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ లక్ష్యం**
**- కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం**

గాయత్రి న్యూస్

మండల పరిధి లోని బందనపూడి లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.36 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న గ్రామ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులకు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఎంపీడీఓ జె. రాంబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న ఈ నిర్మాణం గ్రామీణ ప్రజలకు మరింత చేరువలో వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా



వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తోందన్నారు.గ్రామ హెల్త్ క్లినిక్ నిర్మాణం పూర్తయిన అనంతరం బందనపూడి గ్రామ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.అభివృద్ధి కార్యక్రమాలు గ్రామ స్థాయికి చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని వాసంశెట్టి సత్యం తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రాజపూడిలో డిజిటల్ టిడిపిమహానాడు పసుపు జెండా రెపరెపలు తో విజయవంతం చేయాలి

**- క్లస్టర్ ఇంచార్జ్ పైడిపాల సూరిబాబు**

గాయత్రి న్యూస్

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక పసుపు పండుగ మహానాడు 2026ను ఈసారి డిజిటల్ రూపంలో మల్లిసాల క్లస్టర్ కేంద్రంగా రాజపూడిలో ఘనంగా నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. అరుదైన అవకాశం, అద్భుతమైన వేదిక మే 27, 28 తేదీల్లో రాజపూడిలోని చేల్లా నాగేశ్వరరావు కళ్యాణ మండపంలో భారీ ఎల్ఈడీ స్క్రీన్లపై మహానాడు ప్రత్యక్ష ప్రసారం. ఇంధనం పొదుపు దేశానికి మేలు అనే ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నినాదానికి మద్దతుగా వర్చువల్‌గా జరిగే ఈ మహానాడు చరిత్ర సృష్టించనుంది. నాయకుల పిలుపు క్లస్టర్ ఇంచార్జ్ పైడిపాల సూరిబాబు మాట్లాడుతూ, “తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి. మల్లిసాల, వెంగయ్యమ్మపురం, రాజపూడి, కృష్ణాపురం, గోవిందపురం, మన్యంవారిపాలెం,



సీతారామపురం, జె.కొత్తూరు గ్రామాల నుంచి పసుపు దండు కదలిరావాలి” అని పిలుపునిచ్చారు.ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అగ్రనేతలు సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఈ డిజిటల్ మహానాడును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇది కేవలం కార్యక్రమం కాదు: ఉద్యమం.. జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రేఖ బుల్లి రాజుఇది టెక్నాలజీతో టీడీపీ వేస్తున్న కొత్త అడుగు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా జరిగే ఈ మహానాడును ప్రతి తెలుగుదేశం అభిమాని, కార్యకర్త



పండుగలా జరుపుకోవాలని కాకినాడ జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రేఖ బుల్లి రాజు, కోరారు. రండి, కదలిరండి. రాజపూడి వేదికగా పసుపు సైన్యం సత్తా చాటుదాం. అంటూ క్లస్టర్ పరిధిలోని గ్రామాలనుంచి డిజిటల్ మహానాడుకు తరలిరావాలని రాజపూడి సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి బుల్లె బ్బు, క్లస్టర్ కు ఇన్చార్జి కొల్లి రామకృష్ణ, యూనిట్ ఇన్చార్జి కే .శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమంలో మల్లిశాల క్లస్టర్ పరిధిలోని అన్ని గ్రామాల నుంచి టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

# పేద రోగులకు ఆపన్న హస్తం స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్ట్

గాయత్రి న్యూస్




కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రోగులు, వారి బంధువులు, పేదవారికి ఉచిత భోజన వసతి కల్పించారు. ట్రస్ట్ సభ్యులు స్వయంగా భోజనం పంపిణీ చేస్తూ, ప్రేమ-పరమార్ధంతో ఆదుకోవాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ, “పేదవారికి ఆహారం సమకూర్చడం చాలా ఆనందం అనిపిస్తోంది. మనం చేసిన చిన్న సహాయం కూడా ఎన్నో కుటుంబాల్లో ఆశ నింపగలదు. ఈ ప్రయత్నం నిరంతరంగా కొనసాగుతూ మరెందరికో ఉపశమనం కలిగించాలని కోరుకుంటున్నాం” అని అన్నారు.ఆసుపత్రిలో చేరిన అనేక మంది రోగులు, వారి బంధువులు, అలాగే ఆహార వసతి లేక ఇబ్బందిపడే పేదవారు ప్రతి సోమవారం జరిగే ఈ సేవలతో ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది స్నేహహస్తం సభ్యులు మీరా మొహిద్దిన్, కిషోర్ బాబు, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

# భైరవకోనలో దద్దాల ప్రత్యేక పూజలు

గాయత్రి న్యూస్



సీయస్ పురం మండలంలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పర్యాటక శైవక్షేత్రమైన భైరవకోనలో సోమవారం కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ గారు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా జలపాతంను సందర్శించి,శ్రీ త్రిముఖ దుర్గాదేవి అమ్మవారు,భర్గేశ్వర స్వామి, నాగరేశ్వర స్వామి,కాలభైరవేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివలింగాలను దర్శించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణతో ఆశీర్వదించి, స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి పూలదండ,స్వామి వారి శేషవస్త్రంతో ఘనంగా సన్మానించారు.శ్రీ త్రిముఖ దుర్గాభర్గులేశ్వర స్వామి ఆశీస్సులతో నియోజకవర్గం లోని ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు.

# హైబ్రిడ్ మహానాడును విజయవంతం చేద్దాం

**- టీడీపీ పీలేరు నియోజకవర్గ పరిశీలకులు సుబ్బయ్య**

రిపోర్టర్ : మునిరత్నం శ్రీకాళహస్తి,, గాయత్రి న్యూస్, మే 25:



తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే ‘మహానాడు’ పండుగను పీలేరు నియోజకవర్గంలో విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ పరిశీలకులు ఎం. సుబ్బయ్య పిలుపునిచ్చారు. ఈసారి మహానాడును హైబ్రిడ్ పద్ధతిలో వర్చువల్ ప్రోగ్రామ్స్ ద్వారా క్లస్టర్ల వారీగా నిర్వహిస్తున్న నేపథ్యంలో, నియోజకవర్గంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆయన పీలేరు మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డితో కలిసి సుదీర్ఘంగా చర్చించారు. ఈ వర్చువల్ మహానాడు కార్యక్రమాలకు హాజరయ్యే మండల నాయకులు, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, మరియు బూత్ కన్వీనర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సుబ్బయ్య సూచించారు. క్లస్టర్ల వారీగా వారికి కావలసిన మౌలిక సదుపాయాలు, సాంకేతిక వసతులు మరియు ఇతర ఏర్పాట్లను ఏ విధంగా సమకూర్చాలనే అంశాలపై మండల అధ్యక్షుడికి దిశా నిర్దేశం చేశారు. డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రతి ఒక్క కార్యకర్తను ఈ మహానాడులో భాగస్వామ్యం చేయడమే మన లక్ష్యమని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు పీలేరు నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

# అంగన్వాడి పోస్టుల కేటాయింపు పై అభ్యంతరం

**- జి.ఓ నెం.3ను సుప్రీంకోర్టు రద్దు చేసినప్పటికీ అమలు చేస్తున్నారని ఆరోపణ**
**- అంగన్వాడి టీచర్ ఆయా పోస్టులను ఎస్టీలకు కేటాయించడం అన్యాయమని వినతి**
**- ఐసీడీఎస్ అధికారికి సోషల్ మోటివేటర్ దార సంజీవరావు మెమోరాండం సమర్పణ**



గాయత్రి న్యూస్, ఏలూరు జిల్లా ఇంఛార్జి,బి.ప్రభాకర్
కుకునూరు మండలంలో అంగన్వాడి టీచర్ ఑ ఆయా పోస్టుల కేటాయింపుపై వివాదం నెలకొంది. జి.ఓ నెం.3ను సుప్రీంకోర్టు రద్దు చేసినప్పటికీ అదే విధానాన్ని కొనసాగిస్తూ పోస్టులను ఎస్టీ అభ్యర్థులకు కేటాయించడం సరైంది కాదని సోషల్ మోటివేటర్ సంజీవరావు అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన ఐసీడీఎస్ అధికారికి సోమవారం మెమోరాండం సమర్పించి, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని కోరారు. నియామకాల్లో అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించరాదని విజ్ఞప్తి చేశారు.అంగన్వాడి పోస్టుల భర్తీ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సంజీవరావు కోరారు.

# వృద్ధాప్య వితంతు పెన్షన్లు కొత్తవి ఇవ్వండి

**- సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకుల డిమాండ్**





గాయత్రి న్యూస్ ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్
ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం సోందే గొల్లగూడెం గ్రామస్తులు వేలేరుపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్హులైన వృద్ధులకు , వికలాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలని దరఖాస్తులు ఇవ్వటం జరిగింది.వారిలో పూసం రాధా, బంధం తులసి, తెల్లం రాజమ్మ, సోంది సీతమ్మ, బుచ్చమ్మ, పి అచ్చమ్మ, పూస ముత్యాలు, పి చిడమయ్య తదితరులు దరఖాస్తులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, లంకపల్లి శివ పాల్గొన్నారు, భర్తలు చనిపోయి నాలుగైదు సంవత్సరాలు గడుస్తున్నా వితంతు పింఛన్లు మంజూరు చేయాలేదని,అధికారులు ఆఫీసు లో చుట్టూ తిప్పుకొని ఇంతవరకు పెన్షన్లు ఇవ్వలేదని,ఇకనైనా మా దరఖాస్తులను పరిశీలించి అధికారులు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.

# పంటలు లేని సమయంలో ఎరువుల అమ్మకాలు నిలుపుదల చెయ్యాలి

**జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి**



గాయత్రి న్యూస్ ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్
కైకలూరు మండలం తామరకొల్లు గ్రామంలో సోమవారం శ్రీనివాస ఫెర్టిలైజర్స్ షాపును జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీ చేశారు. షాపులో ఉన్న యూరియా డిఏపి, పొటాషియం,కాంప్లెక్స్ ఎరువులు భౌతిక నిల్వలు, ఈపాసు నిల్వలు, అమ్మకాలు వివరాలు, స్టాకు రిజిస్టర్లు, రైతులకు ఇస్తున్న బిల్లులను పరిశీలించి, కొన్ని వివరాలను జిల్లా కలెక్టరు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ అన్ సీజన్లో పంటలు లేని సమయంలో ఎరువులు ముఖ్యంగా యూరియా, డిఏపి అమ్మకాలు నిలుపుదల చెయ్యాలని ఆదేశించారు. సదరు షాపులో నిలుపుదల చేసిన వివరాలు కూడా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల మేరకు పంటకు అనుగుణంగా ఎరువుల విక్రయాలు చేపట్టాలని సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నందున రైతులకు సరైన సమయంలో అనుగుణంగా అవసరం మేరకు ఎరువులు అందుబాటులో ఉంచాలని రిటైల్ డీలర్లు మరియు సహకార సంఘాలు ద్వారా యూరియా, డిఏపి మరియు ఇతర ఎరువులు నిల్వలు ఉంచాలని తెలిపారు. రైతులకు అందాల్సిన ఎరువులు అక్రమంగా వ్యవసాయ యేతర అవసరాలకు వినియోగించడం బ్లాక్ మార్కెటు, అక్రమ నిల్వలు పారిశ్రామిక అవసరాలకు వినియోగించిన అటువంటి డీలర్లపై ఎరువులు చట్టం ప్రకారం కఠిన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలియజేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ఎరువులు అందుబాటులో ఉంచుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జెడి యస్.కె.హబీబ్ భాషా, ఇంచార్చి ఏడిఏ కె.శ్రీనివాస కుమార్, మండల వ్యవసాయ అధికారి ఆర్.దివ్య, గ్రామ విఏఏలు, మరియు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# సేవా పురస్కారంతో ఘనంగా సత్కరించబడిన షేక్ అబ్దుల్ గఫార్






గాయత్రి న్యూస్
సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి,మహిళలు--బాలికల సాధికారతకు, పర్యావరణ పరిరక్షణకు, నిస్వార్ధ సేవా కార్యక్రమాలకు విశేష కృషి చేస్తున్న కనిగిరి ప్రముఖ న్యాయవాది,కె ఎస్ ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్,కనిగిరి పురపాలక సంఘం మాజీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్‌కు సేవా పురస్కారం లభించింది.ఆదివారం హైదరాబాద్‌లోని టెక్నో మహేంద్ర సమావేశం మందిరంలో అత్యంత వైభవంగా జరిగిన ప్రతిష్టాత్మక “బి ది చేంజ్” అవార్డు ఫంక్షన్‌లో ఈ సత్కారం జరిగింది.రెండు దశాబ్ద కాలంగా సమాజ హితం కోసం, ప్రజల శ్రేయస్సు కోసం చేసిన సేవలను గుర్తిస్తూ ఆల్రౌండ్ కేటగిరీలో అత్యున్నతమైన “అపెక్స్ అవార్డు” లో భాగంగా లీడర్‌షిప్ గుర్తింపుగా ఇచ్చే “వ్యాన్‌గార్డ్” అవార్డును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున మార్కాపురం జిల్లా కనిగిరి ప్రాంతానికి చెందిన షేక్ అబ్దుల్ గఫార్‌ను తెలంగాణ హైకోర్టు జడ్జి జి. రాధారాణి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఘనంగా సత్కరించి పురస్కారం షీల్డ్ ను బహూకరించారు.గత 20 సంవత్సరాలుగా అనేకమంది బాలలకు సున్తీ కార్యక్రమాలు నిర్వహించడం, మహిళలు మరియు బాలికల సాధికారత కోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం, కరోనా మహమ్మారి సమయంలో ప్రజలకు అండగా నిలిచి సేవలు అందించడం వంటి సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు నిర్వాహకులు చల్లా రామ్ చరణ్ తెలిపారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ షేక్ అబ్దుల్ గఫార్ సమాజ సేవలో నిరంతరం ముందుండి సేవలు అందిస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.సేవా భావంతో చేసే కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా సమాజానికి నేను చేసిన చిన్న సేవను గుర్తించి, ఇంతటి పెద్ద వేదికపై గౌరవించడం చాలా ఆనందంగా ఉందని,ఈ పురస్కారం నాపై బాధ్యతను మరింత పెంచిందని తనపై చూపిన గౌరవానికి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవే తన లక్ష్యమని,భవిష్యత్తులో కూడా విద్య,ఆరోగ్యం, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు.ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ వేడుకలో అవార్డును అందుకోవడం పట్ల షేక్ అబ్దుల్ గఫార్ కు విశిష్ట పుష్కరం అందుకున్న సందర్భంగా కనిగిరి పుర ప్రముఖులు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మహిళా సంఘాలు అభినందనలు తెలిపి పలువురు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ టి పి సి సి ముఖ్య కార్యదర్శి డి. శ్రీను బాబు, మాజీ ఐ ఎఫ్ ఎస్ అధికారి బి. ఎం వినోద్ కుమార్, రిటైర్డ్ సౌత్ సెంట్రల్ రైల్వే సి పి ఆర్ ఎ. శ్రీధర్, బి ది చేంజ్ వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ చల్లా రామ్ కళ్యాణ్, వైస్ ప్రెసిడెంట్ వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

# అధిక ఉష్ణోగ్రతలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్**



గాయత్రి న్యూస్
రోజురోజుకి పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలు హీట్ వేవ్ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ అవసరమైన జాగ్రత్తలు పాటించాలని క్రోసూరు మండల ఆరోగ్య విస్తరణ అధికారి, క్రోసూరు మండలం హీట్ వేవ్ నోడల్ ఆఫీసర్ శిఖా శాంసన్ సూచించారు సోమవారం హీట్ వేవ్ పై ఆయన క్రోసూర్ పిహెచ్సి నందు ప్రజలకు తగు జాగ్రత్తలు సూచించారు అధిక ఉష్ణోగ్రతల కారణంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ప్రత్యేకంగా ఆరోగ్యపరంగా అధిక ఉష్ణోగ్రతలపై శ్రద్ధ తీసుకోవాలన్నారు ముఖ్యంగా ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు ఒకవేళ బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటే తలగ టోపీ, గుడ్డ లేదా గొడుగు ఉపయోగించటంతోపాటు స్వచ్ఛమైన త్రాగునీరు, మజ్జిగ వంటి వాటిని వెంట తీసుకెళ్లాలన్నారు శరీరంలో నీరసం రాకుండా తరచూ మంచినీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచించారు వేసవి తీవ్రత కారణంగా హీట్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున తలనొప్పి, తల తిరగటం, అధిక చెమటలు, అలసట, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు రైతులు నిర్మాణ కార్మికులు ట్రాఫిక్ సిబ్బంది వంటి వారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు వడదెబ్బ (హిట్ స్ట్రోక్) అంటే శరీర ఉష్ణోగ్రత చాలా ఎక్కువగా పెరిగి (సాధారణంగా నూట నాలుగు డిగ్రీల ఎఫ్ పైగా) శరీరం చల్లబడే సామర్థ్యం తగ్గిపోవడం వల్ల వచ్చే అత్యవసర పరిస్థితిని వడదెబ్బ అంటారని ఆయన పేర్కొన్నారు వడదెబ్బ ప్రారంభ లక్షణాలు గూర్చి వివరిస్తూ ఎక్కువగా దాహం, బలహీనత, అలసట, తల తిరగటం, అధిక చమటలు, తలనొప్పి, వాంతులు లేదా వికారం కండరాలు పట్టేయడం అని పేర్కొన్నారు తీవ్రమైన వడదెబ్బ లక్షణాలు గూర్చి ఆయన తెలియజేస్తూ శరీరం చాలా వేడిగా ఉండటం, చెమటలు ఆగిపోవడం (కొన్ని సందర్భాలలో) గందరగోళం మాటలు తడబడటం, మూర్ఛ, వేగంగా గుండె కొట్టుకోవడం, స్పృహ కోల్పోవడం అని ఆయన పేర్కొన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తికి తీసుకోవాల్సిన ప్రధమ చికిత వివరాలను ఆయన పేర్కొంటూ వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడ ఉన్న చోటికి తీసుకువెళ్లాలి అని అన్నారు బట్టలు సడలించాలని, చల్లటి నీటిలో శరీరాన్ని తుడవాలి , ఫ్యాను లేదా గాలి అందే విధంగా చూడాలన్నారు మెడ చేతి కుచ్చిళ్ళు తొడల వద్ద పెట్టాలి అని అన్నారు స్పృహలో ఉంటే ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ లేదా నీరు కొద్ది కొద్దిగా ఇవ్వాలి అన్నారు నోటిలో ఏది పోయొద్దు అని పేర్కొన్నారు వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గాని 108 గాని పంపాలన్నారు ప్రతి 20 -30 నిమిషాలకు నీరు త్రాగాలన్నారు

# అత్యుత్తమ విద్యా బోధన ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యం

**- జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ వి జగన్మోహన్**
**- ఎంఈవోలు జోసెఫ్,చిన్నారావు ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్**



గాయత్రి న్యూస్
అత్యుత్తమ విద్యా బోధన ప్రతిభ గల ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యమని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి వి జగన్మోహన్ అన్నారు.కిర్లంపూడి మండలం వీరవరం గ్రామంలో ఎంఈఓలు టి జోసెఫ్,మక్కా చిన్నారావుల ఆధ్వర్యంలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ఏఎంఓ వి జగన్మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ డ్రైవ్లో ఆయన సమక్షంలో ఆరు మంది విద్యార్థులను వీరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించారు.ఈ సందర్భంగా ఏఎమ్ఓ మాట్లాడుతూ అర్హత గల పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు.ప్రభుత్వం అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం,సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లతోపాటు,ప్రతిభగల ఉపాధ్యాయులు అందించే అత్యుత్తమ విద్యా బోధనతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ సంవత్సరం పదవ తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలలోని విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని తెలిపారు.విద్యార్థుల తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు టి.జోసెఫ్,మక్కా చిన్నారావు,వీరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్,ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీలు,పార్ట్ టైమ్ ఇన్స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

## నాగార్జున ఎమోషనల్: డిస్ట్రిబ్యూటర్ 'నెల్లూరు' హరి
## కన్నుమూత.. అక్కినేని ఫ్యామిలీ బలమైన అండను కోల్పోయింది



తెలుగు సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ (పంపిణీదారుడు), ఎగ్జిబిటర్, నిర్మాత 'నెల్లూరు' హరి అలియాస్ గుజ్జలపూడి హరికుమార్ (46) కన్నుమూశారు. ఆదివారం (మే 24, 2026) ఉదయం గుండెపోటుతో ఆయన తుదిశ్వాస విడిచారు. కేవలం 46 ఏళ్ల వయసులోనే హఠాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందడం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. దాదాపు రెండు దశాబ్దాలుగా పంపిణీ రంగంలో కీలక పాత్ర పోషించిన హరి ఆకస్మిక మరణం సినీ వర్గాలను సైతం దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

హరి పిక్చర్స్ ద్వారా ఎన్నో హిట్ చిత్రాలను హరికుమార్ పంపిణీ చేశారు. 2025లో 'సంక్రాంతికి వస్తున్నాం' సహా పలు సక్సెస్ ఫుల్ సినిమాల వెనుక కీలక పాత్ర పోషించారు. 2006లో రామ్ నటించిన 'దేవదాస్' సినిమాను తమిళనాడులో విడుదల చేసి వరుస సినిమాలను పంపిణీ చేసి సక్సెస్ అయ్యాడు. ఈ క్రమంలోనే హరి గత 20 ఏళ్లలో వందలాది చిత్రాలను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. టాలీవుడ్‌లోని అగ్ర నిర్మాణ సంస్థలైన అన్నపూర్ణ స్టూడియోస్, శ్రేష్ఠ మూవీస్, వైజయంతీ మూవీస్, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ల నుంచి వచ్చిన పలు భారీ చిత్రాలను నెల్లూరు ప్రాంతంలో పంపిణీ చేస్తూ హరి ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ఈ క్రమంలోనే హరి మృతిపై సినీ స్టార్స్, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

హరి మరణవార్త వినగానే అక్కినేని నాగార్జున తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆయనతో తనకు ఉన్న 25 ఏళ్ల సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియా వేదికగా భావోద్వేగ పోస్ట్ పెట్టారు.

"గుజ్జలపూడి హరికుమార్ మరణ వార్త నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి, విషాదానికి గురిచేసింది. మా పరిచయం 25 ఏళ్లకు పైగా ఉంది. అక్కినేని కుటుంబానికి ఆయన ఎప్పుడూ ఓ అండగా నిలిచారు. మా జీవితాల్లో ఆయన స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. తెలుగు సినీ పరిశ్రమ ఒక గొప్ప డిస్ట్రిబ్యూటర్‌ను, అద్భుతమైన మనసున్న వ్యక్తిని కోల్పోయింది. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను" అంటూ నాగార్జున సంతాపం వ్యక్తం

## అది ఏమాత్రం మంచిది కాదు..
## ఎడ్యుకేషన్ సిస్టమ్‌పై పూరి మ్యూజింగ్స్



మార్కులకే ప్రాధాన్యమిస్తూ విద్యార్థులను కాంపిటేషన్ మోడ్‌లో ఉంచడం ఏమాత్రం మంచిది కాదని ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ పేర్కొన్నారు. పాఠశాల, కళాశాలల్లో సబ్జెక్టుల కన్నా ముందు జీవితం గురించి నేర్పాలని అభిప్రాయపడ్డారు. 'ఫ్యూచర్ ఎడ్యుకేషన్' పేరిట 'పూరి మ్యూజింగ్స్'లో విద్యావ్యవస్థపై మాట్లాడారు.

"నేటి మోడ్రన్ స్కూళ్లు పిల్లలకు అపారమైన జ్ఞానాన్ని అందిస్తున్నాయి. అయితే ఆ నాలెడ్జ్ విద్యార్థులను బలమైన వ్యక్తులుగా (మానసికంగా) తయారు చేసేందుకు ఉపయోగపడదు. ఇంటి పనులు ఎలా చేసుకోవాలన్నది ఎల్‌కేజీ నుంచే నేర్పాలి. శుభ్రత గురించి చెప్పాలి. ఐదేళ్లకే సమయపాలన, నిజాయతీ అంటే ఏంటో వివరించాలి. ప్రతి విద్యార్థికీ క్రమశిక్షణను నూరిపోయాలి. కుకింగ్ క్లాసెస్ కూడా ఉండాలి. వ్యాయామం, ఆటలు తప్పనిసరి చేయాలి. డిజిటల్ డిసిప్లిన్ గురించి చెప్పాలి.

ఇప్పటి స్కూళ్లన్నీ పరీక్షలు, మార్కులు, కంఠస్తం చేయడంపై దృష్టి పెడుతున్నాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ కన్నా ముందు సెల్ఫ్ కంట్రోల్, టైమ్ మేనేజ్‌మెంట్, ఎమోషనల్ బ్యాలెన్స్ లాంటి వాటిపై పాఠాలుండాలి. ఇవే వారికి జీవితంలో ఉపయోగపడతాయి. వారానికోసారి విద్యార్థులతో మెడిటేషన్ చేయించాలి. వయసుపెరిగేకొద్దీ.. ఒత్తిడిని ఎలా అధిగమించాలి? కోపాన్ని ఎలా కంట్రోల్ చేయాలి? అన్నవి చెప్పాలి. కమ్యూనికేషన్ ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. కనీసం మూడు భాషలు మాట్లాడేలా చూడాలి. మెంటల్ హెల్త్‌పై అవగాహన కలిగించేలా ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలి. అన్నింటికన్నా ముఖ్యంగా ప్రకృతిని ఎలా కాపాడుకోవాలన్నది చెప్పాలి. వీటి తర్వాతే మిగిలిన సబ్జెక్టులుండాలి. జీవితంలో కష్టం ఎదురైతే పాఠశాలలో చెప్పిన మోటివేషన్ క్లాస్ గుర్తురావాలి. అందుకే పిల్లల్ని మోటివేట్ చేసే టీచర్లు కావాలి. ఈరోజుల్లో ఏ డిగ్రీ అయినా అది బేసిక్ ఎడ్యుకేషన్ మాత్రమే. దానితో జీవితం మారిపోదు. దానికోసం చిన్నప్పటి నుంచీ పుస్తకాలను భుజాన మోయించాల్సిన అవసరం లేదు. మార్కుల కోసం వారిని కాంపిటిషన్ మోడ్‌లో పెట్టడం మంచిది కాదు. దీని వల్ల చిన్నప్పుడే ఆందోళనకు లోనవుతున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కల ప్రకారం.. మన దేశంలో ఏటా 13,000 నుంచి 15,000 మంది విద్యార్థులు సూసైడ్ చేసుకుంటున్నారు. అకడమిక్ ఒత్తిళ్లు, ఫెయిల్యూర్‌కి భయపడటం, కుటుంబం పెట్టుకున్న అంచనాలు, డిప్రెషన్‌లాంటివి ఇందుకు కారణం. ఇన్ని వేల మంది ఆత్మహత్య చేసుకుంటున్నారంటే వారి మానసిక పరిస్థితిని అర్థం చేసుకోండి.

మన ఎడ్యుకేషన్ సిస్టమ్ మారాలి. పిల్లలు పర్సనల్‌గా స్ట్రాంగ్ కావాలి. పోలీసు అధికారులను స్కూళ్లు, కాలేజీలకు ఆహ్వానించి విద్యార్థులకు సివిక్ సెన్స్ నేర్పించాలి. చదువుకన్నా సంస్కారం ముఖ్యం. అందుకే సంస్కారం, మనోస్థైర్యం నేర్పే ఎడ్యుకేషన్ రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా" అని అన్నారు.



## ఈవెంట్‌లో తడబడిన రామ్‌చరణ్.. క్రికెటర్‌కు క్షమాపణలు

ప్రముఖ నటుడు రామ్‌చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' మూవీ ఈవెంట్ లో శనివారం సాయంత్రం భోపాల్‌లో ఘనంగా జరిగిన సంగతి తెలిసిందే. అయితే, వేదికపై క్రికెటర్ల గురించి ఒక్క మాటలో చెప్పాలంటూ హోస్ట్ ర్యాపిడ్‌ఫైర్ నిర్వహించారు. ఈ క్రమంలో చరణ్ కాస్త తడబడ్డారు. జస్‌ప్రీత్ బుమ్రా కు తాను అభిమానిని అని చెప్పిన చరణ్.. ఆయన్ను ఫుట్‌బాల్ ప్లేయర్‌గా పేర్కొన్నారు. సంబంధిత క్లిప్పింగ్ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీనిపై స్పందిస్తూ రామ్‌చరణ్ క్షమాపణలు చెప్పారు."నేను కొన్నిసార్లు పేర్లను మర్చిపోతుంటా. జనసందోహం, అక్కడ హంగామా మధ్య అనుకోకుండా పొరపాటు జరిగింది. జస్‌ప్రీత్ బుమ్రాకు క్షమాపణలు. ఆయన్ను నేను గౌరవిస్తాను. ఆయన ఆటకు నేను పెద్ద ఫ్యాన్. బ్యాటర్లు వెనకడుగు వేసేలా మీ నిలకడైన ఆటతీరు భారతీయులంతా గర్వపడేలా చేస్తోంది" అని కొనియాడారు. ఈవెంట్ నిర్వహించిన ప్రాంతం విషయంలోనూ చరణ్ పొరపడ్డారు. భోపాల్‌కు బదులు బిహార్ అని ప్రస్తావించారు. అయితే, తన పొరపాటును

### పెద్ది డ్యాన్స్ ట్రై చేద్దామా.. ఇన్‌స్టా స్టోరీస్‌లో 'పెద్ది' పోస్టర్లతో ఆసీస్ క్రికెటర్ రచ్చ రచ్చ!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 'పుష్ప' సినిమాలోని 'తగ్గేదే లే' డైలాగులు, సాంగ్స్‌కు రీల్స్ చేసి సోషల్ మీడియాలో రచ్చ లేపిన ఆస్ట్రేలియా డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆ రీల్స్‌తో తెలుగు ఆడియన్స్‌కు విపరీతంగా దగ్గరైన వార్నర్.. ఆ తర్వాత యంగ్ హీరో నితిన్ నటించిన 'రాబిన్ హుడ్' సినిమాలో ఒక క్రేజీ క్యామియో (ప్రత్యేక పాత్ర) రోల్ ప్లే చేసి వెండితెరపై కూడా అలరించాడు. ఇక రీల్స్‌తో మొదలైన వార్నర్ టాలీవుడ్ ప్రయాణం.. ఇప్పుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ రాబోయే మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'పెద్ది' కి అఫీషియల్ సపోర్ట్ ఇచ్చాడు.

రామ్ చరణ్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ లీడ్ రోల్స్ లో నటిస్తున్న 'పెద్ది' సినిమా ప్రమోషనల్ కంటెంట్, అఫీషియల్ పోస్టర్లను డేవిడ్ వార్నర్ తన అధికారిక సోషల్ మీడియా అకౌంట్లలో షేర్ చేశాడు. ముఖ్యంగా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్లను పోస్ట్ చేస్తూ.. పెద్ది డ్యాన్స్ ట్రై చేద్దామా అని పోల్ పెట్టగా సుమారు 94 శాతం మంది‌ ఓం అని సమాధానం ఇచ్చారు. దీంతో మెగా ఫ్యాన్స్ వార్నర్ చేసిన పోస్టులను సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ చేస్తున్నారు.'ఆర్ఆర్ఆర్' తర్వాత రామ్ చరణ్ నటిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదటిసారి చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తుండటం విశేషం. గతంలో 'పుష్ప', 'ఆర్ఆర్ఆర్' సినిమాలపై రీల్స్ చేసిన వార్నర్, ఇప్పుడు 'పెద్ది' సినిమాకు ఒక ప్రమోటర్ లాగా సపోర్ట్ ఇవ్వడం ఈ

## 'దృశ్యం 3' కలెక్షన్ల సునామీ.. 3 రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లోకి.. తగ్గేదే లేదంటూ భారీ వసూళ్లు

మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ నటించిన 'దృశ్యం 3' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ చిత్రం కేవలం మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. మే21న విడుదలైనప్పటి నుంచి ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ అనేక ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ షోలతో రన్ అవుతోంది. శనివారంతో మూడు రోజులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లతో మోహన్ లాల్ కెరియర్లో మరో బ్లాక్‌బస్టర్?గా నిలిచింది.

ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, క్రైమ్ థ్రిల్లర్ 'దృశ్యం 3' శనివారం (మే23న) ఒక్కరోజే రూ.13.70 కోట్ల నెట్ కలెక్షన్లు రాబట్టింది. ఇందులో మలయాళ వెర్షన్ నుంచి అత్యధికంగా రూ.11.65 కోట్లు రాగా, తెలుగు వెర్షన్ రూ.1.2 కోట్లు, తమిళం రూ.60 లక్షలు, కన్నడ వెర్షన్ రూ.25



లక్షలు వసూలు చేశాయి. దీంతో ఇండియాలో మూడు రోజుల్లో మొత్తం గ్రాస్ కలెక్షన్లు రూ.47.17 కోట్లకు చేరుకోగా, నెట్ కలెక్షన్లు రూ.40.60 కోట్ల వసూళ్లు నమోదు చేసింది.

ఓవర్సీస్‌లోనూ ఈ చిత్రానికి అద్భుతమైన స్పందన లభిస్తోంది. శనివారం ఒక్కరోజే ఓవర్సీస్‌లో రూ.25 కోట్లు రాబట్టి, మొత్తం విదేశీ మార్కెట్లలో రూ. 70 కోట్ల గ్రాస్ మార్క్ అందుకుంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా మొత్తం గ్రాస్ కలెక్షన్లు రూ.117.17 కోట్ల క్లబ్?లో చేరి బాక్సాఫీస్ దండయాత్ర కొనసాగిస్తోంది. ముఖ్యంగా తమిళం, కన్నడతో పోలిస్తే తెలుగులోనే చిత్రానికి ఎక్కువ ఆదరణ లభించడం విశేషం.


దేశవ్యాప్తంగా 5,185 షోలలో ప్రదర్శితమవుతున్న ఈ చిత్రం మే 23న మొత్తం 50.2 శాతం ఆక్యుపెన్సీ నమోదు చేసింది. మలయాళ వెర్షన్‌కు అత్యధికంగా 66.52 శాతం ఆక్యుపెన్సీ నమోదవగా, తమిళ వెర్షన్‌కు 50.69 శాతం స్పందన లభించింది. తెలుగు వెర్షన్ 25.19 శాతం, కన్నడ వెర్షన్ 24.27 శాతం ఆక్యుపెన్సీ నమోదు చేశాయి. ఆడియన్స్ థియేటర్స్?కి




పోటెత్తడం చూస్తుంటే, 'దృశ్యం 3' మరో భారీ మైల్ స్టోన్ దిశగా దూసుకెళ్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సినిమాకి ఫస్ట్ డే కంటే సెకండ్ డే మౌత్ టాక్ ఊపందుకుంది. ఈ క్రమంలోనే మోహన్ లాల్ ఫ్యాన్స్ నుంచి థ్రిల్లర్ ఆడియన్స్ వరకు థియేటర్లో క్యూ కడుతున్నారు. అందువల్ల మేకర్స్ సైతం థియేటర్లు పెంచుతూ సినిమాపై మరింత హైప్ పెంచుతున్నారు. దర్శకుడు జీతు జోసెఫ్ ఈసారి కథలో సస్పెన్స్ కంటే జార్జికుట్టి కుటుంబ భావోద్వేగాలపై ఎక్కువ దృష్టి పెట్టారు. చివర్లో దృశ్యం 4కి సంబంధించిన హింట్ కూడా ఇవ్వడంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది.

## అవన్నీ ఫేక్... బాధ్యులపై చర్యలు

ఏఐ సహాయంతో అసభ్యకర రీతిలో తన ఫొటోలను సృష్టించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రముఖ కథానాయిక రుక్మిణీ వసంత్. వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘించి ఇలాంటి ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని వ్యాఖ్యానిస్తూ ఎక్స్ వేదికగా ఓ నోట్‌ని విడుదల చేశారు. "ఏఐ ఉపయోగించి సృష్టించిన నా ఫొటోలను ఆన్‌లైన్‌లో వైరల్ చేయడాన్ని నేను, నా టీమ్ గమనించాము. అవన్నీ ఫేక్. ఏఐతో చేసినవి అని స్పష్టం చేయదలుచుకున్నా. ఇలాంటి ఫొటోలు, కంటెంట్‌ని సృష్టించి ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యం. ఈ వ్యవహారాన్ని మేము తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఫొటోలు క్రియేట్ చేసిన వారితో పాటు, ఆన్‌లైన్ వేదికగా వైరల్ చేస్తున్న వారిపైనా న్యాయపరంగా, సైబర్ క్రైమ్ ద్వారా చర్యలు ప్రారంభించాం. ఇలాంటి కంటెంట్, ఫొటోలను ఆన్‌లైన్‌లో పంచుకోవడం మానుకోవాలని ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నా" అని అందులో పేర్కొన్నారు. రుక్మిణి స్విమ్మింగ్ పూల్ వద్ద ఫొటోషూట్ చేయించుకుంటున్నట్లు ఉన్న కొన్ని ఫొటోలు, వీడియోలు వైరలవడంతో దీనిపై రుక్మిణీ తాజాగా స్పందిస్తూ ఫేక్ అని స్పష్టం చేశారు. సినిమా, పబ్లిక్ ఈవెంట్స్‌కు హాజరయ్యే నటీమణులను అభ్యంతరకర రీతిలో జూమ్ చేసి ఫొటోలు తీయడంపై రుక్మిణి ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ఆమె ప్రస్తుతం ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న 'డ్రాగన్' సినిమాలో నటిస్తున్నారు.



***GAYATHRI NEWS Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,*** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/26/A3646 .. Cell No - 7386045673 ..... Printed ESHAGNA SERVICE INDIA PRIVATE LIMITED SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.